మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం

- ఎంపీ కేశినేని నాని, ఎమ్మెల్యేలు వెలంపల్లి, మల్లాది
- నాలుగో విడత 'ఆసరా' నిధుల విడుదల


పొదుపు సంఘాల గ్రూపులకు చెక్కు అందజేస్తున్న వెలంపల్లి, మల్లాది, కేశినేని నాని


సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కేశినేని, వెలంపల్లి, మల్లాది, మహిళలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): మహిళా సాధికారతే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని ఎంపీ కేశినేని శ్రీనివాస్ (నాని), ఎమ్మెల్యేలు వెలంపల్లి శ్రీనివాసరావు, మల్లాది విష్ణు అన్నారు. చేయూత, ఆసరా పథకాల అమలతో మహిళలు తమ కాళ్లపై తాము నిలబడి ఇతర రాష్ట్రాలవారికి ఆదర్శంగా నిలిచారని పేర్కొన్నారు. ఆసరా నాలుగో విడత నిధుల విడుదలలో భాగంగా విజయవాడ సెంట్రల్ నియోజకవర్గానికి చెందిన 3,394 స్వయం సహాయక సంఘాల్లోని 33,427 మంది సభ్యులకు రూ.29,52,91,581 చెక్కుల పంపిణీ కార్యక్రమం బుధవారం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి మహిళలతో కలిసి క్షీరాభిషేకం చేశారు. అనంతరం పశ్చిమ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. కులం, మతం, ప్రాంతం, వర్గం, రాజకీయ పార్టీలకు అతీతంగా, అర్హతే ప్రామాణికంగా అర్హులందరికీ రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. పసుపు కుంకుమ పేరుతో మహిళలను మోసం చేసిన వ్యక్తి చంద్రబాబు అని దుయ్యబట్టారు. అక్కచెల్లెమ్మలు బాగుంటేనే కుటుంబం, రాష్ట్రం బాగుంటుందని నమ్మిన తమ ప్రభుత్వం మహిళా సాధికారతకు పెద్ద పీట వేసిందన్నారు. పొదుపు సంఘాల రుణాలు మాఫీ చేస్తానని 2014లో చంద్రబాబు మేనిఫెస్టోలో హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చిన తరువాత మేనిఫెస్టోను చెత్తబుట్టలో పడేశాడని గుర్తుచేశారు. అక్టోబర్ 2016 నుంచి అక్కచెల్లెమ్మలకు సున్నా వడ్డీ పథకాన్ని కూడా రద్దు చేశాడని విమర్శించారు. చంద్రబాబు చర్యలతో అప్పట్లో పొదుపు సంఘాల రుణాలు తడిసి మోపెడై వడ్డీలు, చక్రవడ్డీలు కట్టుకునే పరిస్థితి దాపురించిందని గుర్తు చేశారు. 2019 ఎన్నికల నాటికి డ్వాక్రా మహిళలకు ఉన్న అప్పులన్నీ మాఫీ చేస్తామని వాగ్దానం చేసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. నాలుగేళ్ల క్రితం ప్రారంభించిన వైఎస్సార్ ఆసరాను ఇప్పటికే మూడు దఫాల్లో అమలు చేశారని, ఇది నాలుగో విడతని వివరించారు.

గతంలో పట్టించుకున్న నాథుడే లేడు

గత ప్రభుత్వ పాలనలో డ్వాక్రా అక్కచెల్లెమ్మలను పట్టించుకున్న నాథుడే లేడని సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, ఎంపీ కేశినేని నాని పేర్కొన్నారు. ఇక వారి పిల్లల చదువుల గురించి అయితే చెప్పే పని లేదన్నారు. చంద్రబాబు ప్రభుత్వంలో దోచుకో.. పంచుకో.. తినుకో అన్న రీతిలో పాలన సాగిందని గుర్తుచేశారు. జన్మభూమి కమిటీలు, దళారులు లేకుండా సీఎం జగనన్న ప్రభుత్వంలో బటన్ నొక్కితే చాలు నేరుగా అక్కచెల్లెమ్మల బ్యాంక్ ఖాతాల్లో సంక్షేమ పథకాల నగదు జమవుతోందని వివరించారు. గతంలో ఏ పథకం అందాలన్నా లంచం చెల్లించక తప్పేది కాదని గుర్తుచేశారు. అక్కచెల్లెమ్మలపై ఇంత బాధ్యతగా మమకారం చూపుతున్న ప్రభుత్వం జగన్‌మోహన్‌రెడ్డిదేనని అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నట్లు అక్కచెల్లెమ్మలే వచ్చే ఎన్నికల్లో స్టార్ క్యాంపెయనర్లని పేర్కొన్నారు. కార్యక్రమంలో మేయర్ రాయన భాగ్యలక్ష్మి, డెప్యూటీ మేయర్ అవుతు శైలజారెడ్డి, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

నందమూరినగర్ ఇళ్ల సమస్య పరిష్కారానికి కేబినెట్ ఆమోదం

ఎమ్మెల్యే మల్లాది విష్ణు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): దశాబ్దాలుగా సింగ్‌నగర్ పరిధిలోని నందమూరినగర్ వాసులు ఎదుర్కొంటున్న ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ సమస్య పరిష్కారానికి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని కేబినెట్ ఆమోదం తెలపడం శుభపరిణామని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. నందమూరినగర్‌లో దాదాపు 70 కుటుంబాలు ఎన్నో ఏళ్లుగా ఇళ్ల రిజిస్ట్రేషన్ సమస్యతో ఇబ్బందులు పడుతున్నాయని పేర్కొన్నారు. ఈ అంశాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లగానే ఆయన వెంటనే స్పందించి, సమస్య శాశ్వత పరిష్కారానికి గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడం హర్షణీయమని పేర్కొన్నారు. ఈ అంశం (ఐటమ్ నంబర్ 29)పై మంత్రివర్గ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించి, ఆమోదం తెలపడంతో సమస్యకు పరిష్కారం లభించినట్లయిందని, త్వరలో స్థానికులకు హక్కులతో పట్టాలు అందజేస్తామని ఎమ్మెల్యే విష్ణు ప్రకటించారు. వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టిన నాటి నుంచి నగరంలో ఉన్న పేద ప్రజల ఇళ్ల రిజిస్ట్రేషన్ల సమస్య శాశ్వత పరిష్కారానికి దృఢసంకల్పంతో కృషి చేస్తోందన్నారు. పేదలు, బడుగు, బలహీన వర్గాలకు ఈ ప్రభుత్వం ఎల్లవేళలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. రానున్న ఎన్నికల్లో ప్రజలంతా వైఎస్సార్ సీపీని అఖండ మెజార్టీతో గెలిపించేందుకు సిద్ధం ఉన్నారని పేర్కొన్నారు.

క్లుప్తంగా

దాసాంజనేయ ఆలయానికి రూ.7.16 లక్షల ఆదాయం



మధురానగర్(విజయవాడసెంట్రల్): స్వయంభూ శ్రీ దాసాంజనేయస్వామికి భక్తులు హుండీల ద్వారా రూ.7,16,435 ఆదాయం సమకూరింది. మాచవరం దాసాంజనేయస్వామి ఆలయంలో బుధవారం దేవదాయశాఖ అధికారుల పర్యవేక్షణలో హుండీ కానుకల లెక్కింపు జరిగింది. రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలు అమ్మవారి దేవస్థానం కార్యనిర్వహణాధికారి పి.లోకేశ్వరి పర్యవేక్షణలో భక్తులు, సేవా సంఘం సభ్యులు కానుకల లెక్కింపులో పాల్గొన్నారు. 83 రోజులకు రూ.7,16,435 నగదు, మూడు అమెరికా డాలర్‌లు సమకూరాయని ఆలయ కార్యనిర్వహణాధికారి నాగినేని భవాని తెలిపారు.

కళాకారులను ప్రోత్సహించాలి



విజయవాడ కల్చరల్: సాంస్కృతిక సంస్థలు కళాకారుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని తెలుగు సంస్కృత అకాడమీ సభ్యుడు డాక్టర్ కప్పగంతు రామకృష్ణ సూచించారు. శ్రీ లలిత కళాస్రవంతి 16వ, నవతేజం సచిత్ర మాస పత్రిక ఆరో వార్షిక వేడుకలు, వివిధ రంగాలకు చెందిన వారికి పురస్కారాల ప్రదానం కార్యక్రమం గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో బుధవారం జరిగింది. డాక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ.. కళాకారులు సాంస్కృతిక వారధులన్నారు. విశ్రాంత ఆచార్యుడు డాక్టర్ కె.చందన్ లలితకళా స్రవంతి సేవలను వివరించారు. లలిత కళా స్రవంతి అధ్యక్షురాలు పి.పద్మావతి శర్మ సంస్థ లక్ష్యాలను వివరించారు. సాంస్కృతిక కళా సంస్థల ఐక్యవేదిక అధ్యక్షుడు బోడి ఆంజనేయరాజు గాయనీ గాయకులను అభినందించారు. గాయకుడు పి.వి.ఎస్.ఎన్.శర్మ, డి.పద్మజ, కామేశ్వరి, కొమ్మినేని రత్నకుమారి, మీనా కుమారి తదితరులు తెలుగు హిందీ చిత్రగీతాలను ఆలపించారు. హాస్యం మాసపత్రిక సంపాదకుడు పి.రాములకు ఉత్తమ సంపాదకత్వ పురస్కారం, సాహితీవేత్త ఆర్.జ్యోతికి నందీశ్వర పురస్కారం, జి.విజయశ్రీ గుప్తాకు ఉత్తమ స్విమ్మర్ పురస్కారం ప్రదానం చేశారు.

నాణ్యమైన వైద్యసేవలు అందించాలి



పాయకాపురం(విజయవాడ రూరల్): రోగులకు నాణ్యమైన వైద్య సేవలను అందించాలని 61వ డివిజన్ కార్పొరేటర్ ఉమ్మడి రమాదేవి సూచించారు. శాంతినగర్లోని యూపీహెచ్‌సీలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం బుధవారం జరిగింది. ఈ కార్యక్రమానికి స్థానిక కార్పొరేటర్ ఉమ్మడి రమాదేవి హాజరయ్యారు. ప్రతి కౌంటర్ వద్ద రోగులకు వైద్య సిబ్బంది నిర్వహిస్తున్న వైద్యపరీక్షలను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. రోగులకు నాణ్యమైన వైద్య సేవలను అందించాలని సూచించారు. ఈ శిబిరంలో 437 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను పంపిణీ చేశారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బి.కరేంద్ర నాయక్, డాక్టర్లు శ్రీవల్లి, గాయత్రి, భీమా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పేద చిన్నారులకు పౌష్టికాహారం పంపిణీ



మధురానగర్(విజయవాడసెంట్రల్): హెచ్‌ఐవీ బాధిత చిన్నారులు ఏఆర్‌టీ చికిత్సతో పాటు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా జీవన ప్రమాణం పెంచుకోవచ్చని డాక్టర్ చల్లా హరి కుమార్ సూచించారు. స్థానిక బీఆర్‌టీఎస్ రోడ్డులో బుధవారం హెల్పింగ్ టుగెదర్ 2009 గ్రూప్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేద, హెచ్‌ఐవీ బాధిత చిన్నారులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. డాక్టర్ హరికుమార్ మాట్లాడుతూ పేద, హెచ్‌ఐవీ బాధిత చిన్నారులను గుర్తించి వారికి క్రమం తప్పకుండా పౌష్టికాహారం అందిస్తున్న ట్రస్ట్ సభ్యులను అభినందించారు. వారిని స్ఫూర్తిగా తీసుకుని మరికొందరు సేవా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. తమ సేవా కార్యక్రమాలకు సహకరిస్తున్న వారికి ట్రస్ట్ సభ్యులు షఫీవుల్లా, నాగమల్లిక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఏఆర్‌టీ సెంటర్ కౌన్సిలర్ కనకాల వరప్రసాద్, ట్రస్ట్ సభ్యులు హేమంతరావు, రహీమా, శివప్రసాద్, వైఆర్‌జీకేర్ స్వచ్ఛంద సంస్థ సిబ్బంది బి.రాముల, నాగూర్‌బీ తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్లు తరచూ వైద్య పరీక్షలు చేయించుకోవాలి

డీటీసీ పురేంద్ర


వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న డీటీసీ పురేంద్ర

విజయవాడస్పోర్ట్స్: దృష్టి లోపాలను అధిగమించేందుకు డ్రైవర్లు ప్రతి ఆరు నెలలకు ఓ సారి కంటి పరీక్షలు చేయించుకోవాలని డెప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్(డీటీసీ) ఎం.పురేంద్ర సూచించారు. రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా డీటీసీ కార్యాలయంలో బుధవారం డ్రైవర్లకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పురేంద్ర మాట్లాడుతూ.. కంటి చూపు మందగించినప్పటికీ కొందరు డ్రైవర్లు నిర్లక్ష్యంగా వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారని పేర్కొన్నారు. దృష్టి లోపం ఉన్న డ్రైవర్లు కంటి పరీక్షలు చేయించుకుని మందులు వాడాలని సూచించారు. శారీరక వైకల్యం, వృద్ధాప్యంతో ఉన్న వారు వాహనాలు నడపొద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీఓ వై.ఐశ్వర్యరెడ్డి, ఎంవీఐలు పి.వి.రమణ, కె.వెంకటేశ్వరరావు, ఎస్.శ్రీనివాస్, ఉమామహేశ్వరరావు, ఏఓ సీహెచ్.శ్రీనివాసరావు, ఏపీ రవాణా శాఖ ఉద్యోగుల సంఘం జోనల్ అధ్యక్షుడు ఎం.రాజుబాబు, కార్యదర్శి కె.వి.వి.నాగమురళి పాల్గొన్నారు.

జగనన్నకు పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధం

వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ కన్వీనర్ వెలంపల్లి


వెలంపల్లి శ్రీనివాసరావుకు హారతిస్తున్న మహిళ

మధురానగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో 30 డివిజన్ అభివృద్ధి దిశగా పరుగులు తీసిందని, రూ.25 కోట్లతో రోడ్లు మౌలిక సదుపాయాలు కల్పించామని పార్టీ సెంట్రల్ నియోజకవర్గం సమన్వయకర్త, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక 30వ డివిజన్ బుడమేరు మధ్యకట్టలో బుధవారం 'నియోజకవర్గంలో ప్రతి గడపకు వెలంపల్లి శ్రీనివాస్' నినాదంతో ఎమ్మెల్సీ ఎండీ రూహుల్లా, డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, కార్పొరేటర్ బి.జానారెడ్డితో కలిసి గడప గడపకు వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా వెలంపల్లికి ప్రభుత్వ పథకాల లబ్ధిపొందిన వారు, స్థానికులు హారతులు ఇస్తూ బ్రహ్మరథం పట్టారు. జగనన్న ప్రభుత్వంలో తమకు చేకూరిన మంచిని తెలియజేస్తూ వెలంపల్లి శ్రీనివాస్‌కు అపూర్వ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ.. ప్రజలు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మరోసారి పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారని స్పష్టంచేశారు. తాము ఎక్కడకు వెళ్లినా ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని హర్షం వ్యక్తం చేశారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పారదర్శక పాలన అందిస్తున్నారని వివరించారు.

బొండాకు ఓటు అడిగే అర్హత లేదు

టీడీపీ పాలనలో ప్రజాసంక్షేమాన్ని విస్మరించి అందిన కాడికి దోచుకోవటమే కాకుండా కబ్జాలు చేసిన బొండా ఉమాకు ఓటు అడిగే అర్హత లేదని వెలంపల్లి అన్నారు. చంద్రబాబు అధికారంలోకి వస్తే కాల్వగట్లపై ఇళ్లు తీసేస్తారని, బొండా ఉమా గెలిస్తే కబ్జాలు చేస్తారని ప్రజలు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. వారికి ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు దుర్గారావు, అమ్ముల వివేకానంద తదితరులు పాల్గొన్నారు.

శ్రావ్యంగా సాగిన త్యాగరాజ కృతి వైభవం



వీణపై త్యాగరాజ స్వామి కృతులను పలికిస్తున్న సుజాత, వాద్య సహకారం అందిస్తున్న శివశంకర్

విజయవాడ కల్చరల్: సంగీత సన్మండలి, ఆంధ్రప్రదేశ్ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు సంగీత కళాశాలలో నిర్వహిస్తున్న శ్రీ త్యాగరాజ స్వామి ఆరాధన సంగీతోత్సవాలు శ్రావ్యంగా సాగుతున్నాయి. త్యాగరాజ స్వామిపై భక్తిని చాటుతున్నాయి. బుధవారం నాటి కార్యక్రమంలో పిండిప్రోలు సర్వజ్ఞ, కుమారి కె.యశస్విని దత్త, సీహెచ్ శ్రీదేవి, శర్వాణి, గంటి సరోజని, ముద్రాడి వైష్ణవి, పొన్నపల్లి రమాభగవాన్ తదితరులు త్యాగరాజ స్వామి రచించి స్వరపరచిన కీర్తనలతో గాత్రం కచ్చేరీ నిర్వహించారు. బి.సుజాత, కొండా సాయిప్రసన్న, అమృత వర్షిణి వీణపై, ఇంద్రకీలాద్రి శర్మ, పి.మురారి వేణువుతో త్యాగరాజ స్వామి కీర్తనలను వీనుల విందుగా వినిపించారు. వారికి నేతి శివశంకర్, దండమూడి సుమతీరామ్మోనరావు, డి.మనసిజ వాద్య సహకారం అందించారు. ఉదయం త్యాగరాజ స్వామి విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సన్మండలి అధ్యక్షుడు మోదుమూడి సుధాకర్, సభ్యులు అంజనా సుధాకర్, వేమూరి విశ్వనాథ్, గందూరి రమాసత్యనారాయణ పాల్గొన్నారు. గురువారం నాటి సంగీత ఉత్సవాలు ఉదయం తొమ్మిది గంటలకు ప్రారంభమవుతాయని అధ్యక్షుడు సుధాకర్ తెలిపారు.

లా అండ్ ఆర్డర్ డీసీపీగా కృష్ణకాంత్‌పటేల్

విజయవాడస్పోర్ట్స్: ఎన్టీఆర్ జిల్లా లా అండ్ ఆర్డర్ డెప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్(డీసీపీ)గా కృష్ణ కాంత్ పటేల్‌ను నియమిస్తూ రాష్ట్ర హోం శాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఆయన కర్నూలు జిల్లా ఎస్ఈబీ అదనపు ఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్నారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఆయన్ని జిల్లా పోలీస్ కమిషనరేట్‌కు హోం శాఖ కేటాయించింది.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహ రించిన వారిపై చర్యలు తప్పవని కొత్తపేట సీఐ గణేష్ పేర్కొన్నారు. కొత్త పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని టీనర్‌పేట అడ్డరోడ్డు ప్రాంతంలో సీఐ ఆధ్వర్యంలో సిబ్బంది స్ట్రీట్ వాక్ నిర్వహించారు. సోరంగం రోడ్డు, టీనర్‌పేట స్కూల్, కొండప్రాంతం, అల్లీనగర్, లంబాడీపేట ప్రాంతాల్లో పర్యటించి స్థానికులతో మాట్లాడారు. సాయంత్రం వేళ యువకులు ఆటోలలో కూర్చుని రాకపోకలు సాగించే వారిని ఇబ్బందులకు గురి చేస్తున్నారని స్థానికులు సీఐ గణేష్ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై సీఐ గణేష్ మాట్లాడుతూ రాత్రి వేళ గస్తీని పెంచడంతో పాటు స్థాని కంగా ఎటువంటి ఇబ్బంది వచ్చినా వెంటనే కంట్రోల్‌రూమ్‌కి పోలీస్ స్టేషన్‌కి ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు. సీఐ వెంట సెక్టార్ ఎస్ఐ, సిబ్బంది పాల్గొన్నారు.

3వ తేదీ నుంచి మహిళా ఉత్సవ్

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ఈ నెల మూడు నుంచి 11వ తేదీ వరకు మధుచౌక్‌లోని మొగల్ ఎగ్జిబిషన్ హాలులో తమ సంస్థ ఆధ్వ ర్యంలో మహిళా ఉత్సవ్ నిర్వహిస్తున్నామని జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ ఎ.పూర్ణిమ ప్రకటనలో తెలిపారు. మహిళలు తయారు చేసిన వస్తువులకు మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించి, వారిని పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ఈ మహిళా ఉత్సవ్ ఎంతగానో దోహదం చేస్తుందన్నారు. ప్రతి సంవత్సరం ఈ మహిళా ఉత్సవ్‌ను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. మహిళా ఉత్సవ్‌లో పాల్గొనాలని ఆసక్తి ఉన్న మహిళలు మొగల్రాజపురంలో రావిచెట్టు సెంటర్‌లోని తమ సంస్థ కార్యాలయంలో నేరుగా సంప్రదించాల్సిందిగా ఆమె కోరారు.

డ్రెయినేజీ పనులు పూర్తి చేస్తాం

మునిసిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్


డ్రెయిన్‌ను పరిశీలిస్తున్న మేయర్ భాగ్యలక్ష్మి, మునిసిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పాయకాపురం(విజయవాడరూరల్): నగర శివారులో అసంపూర్తిగా మిగిలిన అవుట్‌పాల్ డ్రెయినేజీ నిర్మాణ పనులను త్వరలో పూర్తి చేస్తామని నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండకర్ అన్నారు. 63వ డివిజన్లో అసంపూర్తిగా మిగిలిపోయిన అవుట్ పాల్ డ్రెయినేజీని మేయర్ రాయన భాగ్యలక్ష్మి, డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి, మునిసిపల్ కమిషనర్ బుధవారం పరిశీలించారు. ఇటీవల పోతిరెడ్డిపల్లి రెగ్యులేటర్ నుంచి వచ్చిన నీటి వల్ల 63వ డివిజన్‌లోని వడ్డెర కాలనీ, రాజీవ్‌నగర్ ప్రాంతాల ప్రజలు తాగు నీటికి ఇబ్బందిపడిన నేపథ్యంలో ఎంఐజీ కాలనీ, రాజీవ్‌నగర్ కాలనీలో వేసిన రెండు బోర్లతో పాటు, మరో అయిదు రిగ్‌బోర్లు వేసేందుకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఎల్‌అండ్‌టీ సంస్థ అవుట్‌పాల్ డ్రెయిన్ నిర్మాణం పనుల కాంట్రాక్ట్ తీసుకొని మధ్యలోనే వదిలేసి వెళ్లడంతో రాజీవ్‌నగర్ కట్ట నుంచి కండ్రిక వరకు దాదాపు 800 మీటర్ల దూరం అవుట్‌పాల్ డ్రెయినేజీ నిర్మాణం పూర్తికాలేదని, దీంతో రాధా నగర్, రాజీవ్ నగర్, వడ్డెర కాలనీ, పరిసర ప్రాంతాల్లో ఎక్కడి మురుగు అక్కడే నిల్వ ఉంటోందని స్థానిక వైఎస్సార్ సీపీ నాయకుడు మోదుగుల గణేష్ వివరించారు. ఆ పనులు వెంటనే చేపట్టాలని మునిసిపల్ కమిషనర్‌కు మేయర్ రాయన భాగ్యలక్ష్మి సూచించారు. త్వరలోనే 33 తూముల కాలువకు మురుగునీరు చేరేలా డ్రెయినేజీ నిర్మాణం పూర్తిచేస్తామని కమిషనర్ ప్రకటించారు. వీఎంసీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు శ్రీనివాస్, వాటర్ సెక్షన్ ఏఈ అరుణ్‌కుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గుణదల పుణ్యక్షేత్రానికి ఉత్సవ శోభ



క్రైస్తవ ఆధ్యాత్మిక కేంద్రమైన గుణదల మేరీమాత పుణ్యక్షేత్రం ఉత్సవ శోభను సంతరించుకుంది. బుధవారం మరియమాత జెండాను ఆవిష్కరించి నవదిన ప్రార్థనలకు శ్రీకారం చుట్టారు. మఠకన్యలు, భక్తుల సమక్షంలో విజయవాడ కథోలిక పీఠం బిషప్ తెలగతోటి రాజారావు మేరీమాత పతాకాన్ని ఆవిష్కరించారు.

–గుణదల (విజయవాడ తూర్పు)





ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి


ప్రభుత్వ సేవలను వివరిస్తున్న కార్పొరేటర్ పెనుమత్స శిరీష, వార్డు సచివాలయం సిబ్బంది

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని 31వ డివిజన్ కార్పొరేటర్ పెనుమత్స శిరీష సూచించారు. స్థానిక 31వ డివిజన్ పసుపుతోటలో బుధవారం వార్డు సచివాలయం సిబ్బందితో కలిసి ఆమె పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. వార్డు సచివాలయం, వలంటీర్ల సేవలను వినియోగించుకోవాలని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షుడు పెనుమత్స సత్యం, వార్డు సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్‌లో సూర్యచరిష్మ ప్రతిభ

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఇటీవల చెన్నైలో జరిగిన ఖేల్ ఇండియా యూత్ గేమ్స్‌లో నగర విద్యార్థిని టి.సూర్యచరిష్మ బ్యాడ్మింటన్ అండర్–19 బాలికల విభాగం సింగిల్స్‌లో మొదటి బహుమతి పొందింది. దీంతో ఆమె చదువుతున్న శ్రీ దుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.పద్మజ, ఇతర అధ్యాపకులు బుధవారం అభినందనలు తెలిపారు.